సాక్షి
అనంతపురం
సోమవారం । 25 । మార్చి । 2024



ఓటు వివరాలు తెలుసుకోవచ్చు
ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.
8లో



టమాట కిలో రూ.12
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.03



న్యూస్‌రీల్

రూ.16.94 లక్షల సీజ్

- కోడ్ ఉల్లంఘించిన 26 మంది సస్పెన్షన్
- కలెక్టర్ గౌతమి వెల్లడి



అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా తరలిస్తున్న రూ.16,94,500 సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచామని, రసీదులు లేకుండా నిర్దేశించిన మొత్తానికి మించి తీసుకెళుతున్న నగదును సీజ్ చేస్తున్నామన్నారు. సీ–విజిల్ ద్వారా 168 ఫిర్యాదులు అందగా, విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు.

29 మంది సస్పెన్షన్
ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన 29 మందిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో 18 మంది వలంటీర్లు, ఐదుగురు చౌక దుకాణ డీలర్లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక పంచాయతీ కార్యదర్శి ఉన్నారన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక 5,036 పోస్టర్లు, 2,204 బ్యానర్లు, గోడలపై పార్టీలు రాసిన 627 రాతలను తొలగించామన్నారు. నాయకులకు సంబంధించిన 2,986 విగ్రహాలు, ఫొటోలపై వస్త్రాలను కప్పినట్లు తెలిపారు.

కర్ణాటక సరిహద్దుల్లో పటిష్ట నిఘా

అనంతపురం: కర్ణాటక సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఉంచినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు, సెబ్ విభాగం సంయుక్తంగా ఈ ఏడాది జనవరి ప్రారంభం నుంచి అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపారన్నారు. 76,448 టెట్రా ప్యాకెట్లు, 432 కర్ణాటక మద్యం బాటిళ్లు, 7,363 మద్యం సీసాలు, 762 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. 1,284 కేసులు నమోదు చేసి 1,272 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన 206 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల వేళ అక్రమాలు అరికట్టేందుకు జిల్లాలోని రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్ల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. మారణాయుధాలు, లిక్కర్, డబ్బు, మాదకద్రవ్యాలు జిల్లాలోకి రాకుండా కర్ణాటక సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులు, జిల్లా సరిహద్దుల్లో 3 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి చెక్‌పోస్టులో ఆరుగురు సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటున్నారన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అనంతపురం పీసీఆర్ విభాగం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వీటితో పాటు నాలుగు డైనమిక్ చెక్‌పోస్టులు (జిల్లా అంతర్గత చెక్ పోస్టులు కలిపి) ఏర్పాటు చేశామని, ఈ టీంల వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి ప్రతి కదలికను జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షిస్తున్నామన్నారు.

పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు

అనంతపురం: జిల్లా కేంద్రంతో పాటు మున్సిపాలిటీల్లో ఉన్న పార్శిల్ సర్వీసు కార్యాలయాలు, గోదాముల్లో ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నవత, ఎస్ఆర్ఎంటీ, టీవీఎస్, బీఎంపీఎస్‌లతో పాటు ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్లలో ఉన్న పార్శిల్ సర్వీసు కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ప్రతీ పార్శిల్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో దుస్తులు, గడియారాలు, మత్తు పదార్థాలు అక్రమంగా పార్శిల్ సర్వీసు ద్వారా తరలించే అవకాశం ఉండడంతో వీటిని అరికట్టేందుకు తనిఖీలు కొనసాగాయి. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు ఈ కార్యక్రమం చేపట్టారు.



అక్రమాలు.. అరాచకాలు

అధికారంలో ఉన్న సమయంలో రెచ్చిపోయిన జేసీ సోదరులు





జేసీ సోదరులు ఆక్రమించి కరివేపాకు సాగు చేసిన పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరులోని పప్పూరమ్మ మాన్యం భూమి (ఫైల్)



జేసీ దివాకర్ రెడ్డికి చెందిన లారీలు (ఫైల్)

కాదేదీ అక్రమాలకు అనర్హం అన్నట్లు ఆ సోదరులు రెచ్చిపోయారు. అధికారమే అండగా చెలరేగారు. అడ్డగోలుగా వ్యాపారాలు సాగించారు. ప్రకృతి వనరులను కొల్లగొట్టారు. దేవుని మాన్యాన్నీ చెరబట్టేశారు. పేదల కడుపు గొట్టారు. చివరికి అసాంఘిక కార్యకలాపాలకూ తెరలేపారు. తమకు అడ్డు చెప్పిన అధికారులపై దాడులకూ వెనుకాడలేదు. అలాంటి వారు నేడు ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ప్రజల ముందుకు వెళ్తూ నీతి మాటలు మాట్లాడుతుండడంపై జనం నవ్వుకుంటున్నారు.

- రూ.వేల కోట్ల దోపిడీ చేసిన ఘనులు
- ఆదర్శ మున్సిపాలిటీలోనూ అంతులేని అవినీతి
- అప్పట్లో అడ్డొచ్చిన అధికారులకు బెదిరింపులు

తాడిపత్రి అర్బన్: గతంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని జేసీ దివాకర్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. నాలుగు దశాబ్దాల పాటు అక్రమంగా ట్రావెల్స్ వ్యాపారం సాగించి రూ.కోట్లు దండుకున్నారు. ఒక బస్సుతో ప్రారంభమైన వారి ట్రావెల్స్ వ్యాపారం నుంచి వందల సంఖ్యలో బస్సులు పుట్టుకొచ్చాయి. ఒక పర్మిట్ నంబర్‌తో ఏకంగా నాలుగైదు బస్సులు తిప్పుతూ ఆర్టీఏ అధికారులనే బురిడీ కొట్టించేవారు. దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఓ ప్రయాణికురాలు ఇచ్చిన సమాచారం మేరకు 2012లో అప్పటి రవాణాశాఖ కమిషనర్ పూనం మాలకొండయ్య స్వయంగా అధికారులతో కలిసి దాడులు చేశారు. కర్నూలు–హైదరాబాద్ జాతీయ రహదారిలో తనిఖీలు నిర్వహించి మొబైల్ వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. బస్సు సీజ్ చేశారు. ఈ విషయం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, ఘటన జరిగిన కొన్నాళ్ల పాటు నిబంధనలు పాటించిన జేసీ సోదరులు... ఆ తర్వాత మంగళం పాడారు. అంతేనా.. కండీషన్ లేని బస్సులను నడుపుతూ అనేక ప్రమాదాలకు కారణమయ్యారు. ఎంతో మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. అయితే, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వీరి అక్రమాలను బట్టబయలు చేయడంతో ట్రావెల్స్ మూసేశారు.

లగాన్ పేరున గ్రానైట్ మాఫియా..
తాడిపత్రి ప్రాంతంలో 800కు పైగా గ్రానైట్ పరిశ్రమలున్నాయి. మామూలుగా వీటికి గ్రానైట్ రాళ్లను చిత్తూరు, మడకశిర, కర్నూలు ప్రాంతాల నుంచి తీసుకువస్తుంటారు. క్వారీ నుంచి ఒక లోడు గ్రానైట్ తాడిపత్రికి చేరాలంటే రూ.45 వేల నుంచి రూ.50 వేల మేర రాయల్టీ చెల్లించాలి. అయితే టీడీపీ హయాంలో రాయల్టీ లేకుండా క్వారీ నుంచి తాడిపత్రికి గ్రానైట్ చేర్చేలా క్వారీ యాజమాన్యాలు, తాడిపత్రి పాలిష్ మిషన్ వ్యాపారుల మధ్య అక్రమ ఒప్పందం కుదిరింది. దీనికితోడు లారీలో ఉన్న గ్రానైట్ పరిమాణాన్ని బిల్లులో తగ్గించి ఒకే బిల్లుతో ఐదారు లోడ్లు రవాణా చేసేవారు. అలా కొల్లగొట్టిన డబ్బు లగాన్ పేరుతో మాఫియాను నడిపే ఓ పెద్దమనిషి ఇంటికి చేరేది. ఈ క్రమంలోనే 2015 ఆగస్టు 21న మైనింగ్ విజిలెన్స్ ఏడీగా బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్‌రెడ్డి ఈ అక్రమ దందాపై ఉక్కుపాదం మోపారు. 2015కు ముందు ఏటా రూ.కోటి కూడా పెనాల్టీ రూపంలో ప్రభుత్వానికి అందేది కాదు. కానీ 2015–16లో రూ.5.40 కోట్లు, 2016–17లో రూ.5.55 కోట్లు రాబట్టారంటే లగాన్ దందా ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, ప్రతాప్ రెడ్డి ఇక్కడ ఉంటే తమ ఆటలు సాగవని గుర్తించిన జేసీ సోదరులు ఎలాగైనా బదిలీ చేయించాలని చూశారు.చంపుతామంటూ బెదిరింపులకు కూడా దిగారు. దీనిపై అప్పట్లో ఆయన మైనింగ్ విజిలెన్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు ఎస్వీ రవీంద్రారెడ్డి (పొట్టి రవి), అప్పట్లోగ్రానైట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న నాగేశ్వరరెడ్డి, బిల్లుల బాబు నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, కొన్నాళ్లకే ప్రతాప్‌రెడ్డిని బదిలీ చేయించిన ఈ ముఠా..మళ్లీ అక్రమాలు యథేచ్ఛగా సాగించింది. ఈ మాఫియా ద్వారా రూ.200 కోట్లకు పైగా జేసీ సోదరులు వెనకేశారన్న ఆరోపణలున్నాయి.

అర్జాస్ మాటున అక్రమార్జన..
తాడిపత్రి సమీపంలో అర్జాస్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం హుసేనాపురం, జంబులపాడు, చల్లవారిపల్లి, వీరాపురం గ్రామాల ప్రజలు దాదాపు 2 వేల ఎకరాల తమ భూములను అప్పగించారు. వీరు లారీలు, ఇతర మార్గాల ద్వారా ప్లాంటుపై ఆధారపడి జీవించేవారు. అయితే దివాకర్ రోడ్‌లైన్స్, ట్రాన్స్ ఇండియా పేరుతో జేసీ బ్రదర్స్ సొంతంగా ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జేసీ బ్రదర్స్ ట్రాన్స్‌పోర్టును కాదనే ధైర్యం ఫ్యాక్టరీల యాజమాన్యానికి ఉండేది కాదు. దీంతో తొలి ప్రాధాన్యత వారికే ఇచ్చేవారు. అయితే, ఇందుకు సంబంధించిన బిల్లులను జేసీ బ్రదర్స్ ట్రాన్స్‌పోర్టు పేరు మీద కాకుండా తాడిపత్రి లారీ అసోసియేషన్ పేరుపై చేయిస్తూ ప్రభుత్వానికి పన్ను కూడా ఎగ్గొట్టేవారు. లారీలపై జేసీపీఆర్ అని ఉంటుంది. బిల్లులు మాత్రం ఆయన పేరుతో ఉండవు. మొత్తం అక్రమ లెక్కలే. వీరి లారీలు మినహా ఇతర లారీలు స్టీల్‌ప్లాంట్‌లోకి వెళ్లేందుకు వీల్లేదు. ఇలా ఐదేళ్లలో రూ.300 కోట్లు ఆర్జించినట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా డ్రై స్లాగ్ దందా..
అప్పట్లో అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో డ్రైస్లాగ్‌ను టన్ను రూ.1తో తమ బినామీల ద్వారా జేసీ సోదరులు కొనుగోలు చేయించేవారు. అల్ట్రాటెక్ సిమెంట్, సాగర్ సిమెంట్ పరిశ్రమలకు టన్ను రూ.850 చొప్పున విక్రయించేవారు. ట్రాన్స్‌పోర్టు, ఇతర ఖర్చులు కింద రూ. 250 పోగా రూ.600 మేర మిగిలేది. ఇలా ప్రతి నెలా 25 వేల టన్నులకు పైగా డ్రై స్లాగ్ తరలించేవారు. ఈ లెక్కన నెలకు రూ.1.5 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.100 కోట్లు కొల్లగొట్టారు.

ఆదర్శ మున్సిపాలిటీలోనూ అవినీతి..

తాడిపత్రి మున్సిపాలిటీ పేరుకే ఆదర్శం. కానీ, జేసీ సోదరుల ఆగడాలతో భ్రష్టు పట్టిపోయింది. టీడీపీ హయాంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి బినామీగా వ్యవహరించిన ఎస్వీ రవీంద్రారెడ్డి (పొట్టి రవి) తాడిపత్రిలోని జేసీ నాగిరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్‌లో మొదటి అంతస్తు టెండర్ దక్కించుకున్నాడు. ఏడాదికి రూ.7.36 లక్షలు అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. అయితే, మొత్తం కాంప్లెక్స్‌ను దాదాపు 50 మంది వ్యాపారులకు సబ్‌లీజుకు ఇచ్చేశాడు. ఒక్కో వ్యాపారి నుంచి రూ.20 వేల నుంచి రూ.30 వేల చొప్పున అద్దె వసూలు చేసేవాడు. ఈ విధంగా నెలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల ఆదాయం వచ్చేది.



తాడిపత్రి మున్సిపాలిటీ కార్యాలయం

ఇదే కాంప్లెక్స్‌లో 64,68 షాపులు కూడా ఎస్వీ రవీంద్రారెడ్డి దక్కించుకున్నాడు. వీటికి సంబంధించి రూ.3.52 లక్షలు, గుడ్‌విల్ కింద రూ.3.33 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే, బాడుగ వసూలు చేస్తున్నా మున్సిపాలిటీకి అద్దె మాత్రం చెల్లించలేదు. మొదటి అంతస్తుకు సంబంధించి రూ.2.73 కోట్లు, మిగిలిన వాటికి సంబంధించి రూ.7.83 లక్షల వరకూ బకాయి పడ్డారు. దీంతో ఈ దుకాణాల లీజును మున్సిపల్ అధికారులు రద్దు చేశారు. ఇక.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో 62,64,68,76 నంబర్ షాపులను కూడా ఎస్వీ రవీంద్రారెడ్డి దక్కించుకుని, ఒక్కోదానికి రూ.2వేల చొప్పున మాత్రమే అద్దె చెల్లించేవాడు. వ్యాపారులకు మాత్రం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సబ్ లీజుకు ఇచ్చుకున్నాడు. రెండు కాంప్లెక్స్‌లలో అద్దెలు రవీంద్రారెడ్డి వసూలు చేసినా, ఈ డబ్బు తిరిగి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి చేరినట్లు సొంత పార్టీ నేతలే అప్పట్లో చెప్పుకునేవారు.

దేవుని మాన్యాన్నీ వదల్లేదు..

పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరులో వెలసిన పప్పూరమ్మ ఆలయానికి దాదాపు 19 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. తాడిపత్రి–పెద్దపప్పూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భూములను మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి కబ్జా చేశారు. ఫారం పాండ్లు ఏర్పాటు చేయించి బోరు బావుల నీటితో నింపి ఆ భూముల్లో కరివేపాకు, అరటి సాగు చేశారు. పంట దిగుబడుల ద్వారా రూ.లక్షలు ఆర్జిస్తున్నా ఆలయంలో పూజలకు కనీసం ఒక్క పైసా చెల్లించలేదు. ఏడాది క్రితం విచారణకు వచ్చిన దేవదాయ శాఖ అధికారులు భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.



ఇరుసు ఎత్తుతున్న క్రీడాకారుడు



రాతిగుండు ఎత్తుతున్న దృశ్యం

భళా.. గ్రామీణ క్రీడా కళ

యాడికి: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. రాతి గుండు, ఇరుసును పలువురు అలవోకగా ఎత్తి శభాష్ అనిపించుకున్నారు. ఇరుసు ఎత్తే పోటీల్లో నలుగురు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా కొండపల్లి రాజు, వంకరాజు కాలువ సురేష్, గుంతకల్లు తిమ్మాపురం సురేష్ నిలిచారు. వీరికి యాడికి ఎంపీటీసీ సభ్యురాలు గుంతా రామాంజనమ్మ, తిరుపతి దంపతులు రూ.10.వేలు, వార్డు సభ్యుడు రామచంద్ర రూ.5 వేలు, వార్డు సభ్యుడు బాల పెద్దయ్య రూ.3.వేల నగదు బహుమతి అందజేశారు. రాతి గుండు ఎత్తే పోటీల్లో 11 మంది పాల్గొనగా,ఉలిందకొండకు చెందిన మనోహర్ ప్రథమ, తెలంగాణకు చెందిన లాల్‌భాష ద్వితీయ, నంద్యాల జిల్లా డోన్ మండలం గోసానిపల్లెకు చెందిన అర్జున్ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి స్టాంపుల సూర్యనారాయణ రూ.10 వేలు, పఠాన్ ఫరూక్ రూ.5వేలు, సతీష్ నాయుడు రూ.3 వేలను అందజేశారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోస్టు పెట్టే ముందు జరభద్రం

- ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపైనా ఆంక్షలు
- ద్వేషపూరిత, అలజడులు రేపే పోస్టింగ్‌లు పెట్టేవారిపై కేసులు
- వివాదాస్పద పోస్టులను ఫార్వర్డ్ చేసినా బాధ్యులే
- సోషల్ మీడియా ప్రచారమూ పెయిడ్ న్యూస్ కిందకే



అనంతపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేలా ఎన్నికల కమిషన్ అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలపైనా నిఘా వేసింది.ఎవరైనా ద్వేషపూరిత, అసత్య,సమాజంలో అలజడులు రేపే పోస్టింగ్‌లు పెడితే వెంటనే చర్యలు చేపట్టే ఏర్పాట్లు చేసింది.

అధికారుల నిరంతర పర్యవేక్షణ..
మారిన టెక్నాలజీకి అనుగుణంగా సామాజిక మాధ్యమాల (వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం) ద్వారా కూడా రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని అరాచక శక్తులు విద్వేశాలు రాజేసి తమ స్వార్థానికి వాడుకునే అవకాశం లేకపోలేదు. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారుల ద్వారా నిఘా ఉంచింది. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం, తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఐటీ యాక్ట్–2000 సెక్షన్–67 కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు. సోషల్ మీడియా గ్రూపు సభ్యులు అభ్యంతరకరమైన, వివాదాస్పద పోస్టులు, కామెంట్లు పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేస్తే కేసు..
సామాజిక మాధ్యమాల్లో ఎవరిపైనా వ్యక్తిగతంగా కానీ, పార్టీలపై కానీ, సంస్థలు, అధికార యంత్రాంగంపై కానీ అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేస్తారు. చట్ట విరుద్ధమైన ప్రకటనలు, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసినా, ఐపీసీ–504,505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

పెయిడ్ న్యూస్ కింద పరిగణనలోకి..
ఇక.. ప్రస్తుత ఎన్నికల నిబంధన మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

గరుడ వాహనంపై నారసింహుడు



ప్రధాన గోపురం వద్ద శ్రీవారికి హారతి ఇస్తున్న అర్చకులు



ఆలయంలో పోటెత్తిన భక్త జనం

కదిరి: అశేష భక్త జన గోవింద నామస్మరణల మధ్య ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని నారసింహుడికి వాహనంగా పంపుతారని.. అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడ సేవ అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని, ఇహ పరమైన ఈతి బాధల నుంచి విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మకం. నారసింహుని బ్రహ్మోత్సవాల సమయంలో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికేది గరుత్మంతుడే కాబట్టి ఈ వాహన సేవకు ప్రాధాన్యత ఉందని అర్చకులు తెలిపారు.

క్లుప్తంగా

ఏసీడీపీఓ గీతాంజలి మృతి


గీతాంజలి

అనంతపురం సెంట్రల్: మహిళా,శిశు సంక్షేమశాఖలో ఏసీడీపీఓగా అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న గీతాంజలి ఆకస్మికంగా మృతి చెందారు. ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో ఈఓ(ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)గా, సర్వీసు హోం అధికారిగా, కళ్యాణదుర్గం సీడీపీఓగా ఆమె పనిచేశారు. ప్రస్తుతం ఉరవకొండ ప్రాజెక్టు ఏసీడీపీఓగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం అనంతపురంలోని తన స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ఐసీడీఎస్ అధికారులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన రథంపై సత్యసాయి చిత్రపటాన్ని అధిష్ఠింపజేసి ప్రశాంతి నిలయం ముఖద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ముందుకు లాగారు. కార్యక్రమంలో దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంటల సాగుకు ఊతం



రైతు భరోసా పథకంతో పంటల సాగుకు ఊతమిచ్చినట్టైంది. నాకున్న మూడు ఎకరాల్లో గతంలో పంటల సాగుకు పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడేవాడిని. ఉన్న బోరు బావి కూడా ఎండిపోవడంతో దిక్కుతోచలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత విస్తారంగా వర్షాలు కురిసాయి. సీజన్‌కు ముందే నా బ్యాంక్ ఖాతాలో రైతు భరోసా నగదును సీఎం వైఎస్ జగన్ జమ చేశారు. ఈ డబ్బుతో పంట పెట్టుబడుల సమస్య తీరింది. రైతు సంక్షేమానికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ మరోమారు అధికారంలోకి రావాలి.

– రైతు అనిల్‌కుమార్, రామినేపల్లి, బొమ్మగుప్ప మండలం

గౌరవ మర్యాదలు పెరిగాయి



నాకు 70 ఏళ్ల వయస్సు. ఈ వయస్సులో ఉన్న మాకు సీఎం వైఎస్ జగన్ అందజేస్తున్న సంక్షేమ ఫలాల వల్ల గౌరవ మర్యాదలు పెరిగాయి. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సేవలు నేను చూడలేదు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500, వృద్ధాప్య పింఛన్ కింద ప్రతి నెలా రూ.3వేలు చొప్పున అందుకున్నా. ఇలాంటి ముఖ్యమంత్రిని మరోమారు అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– తిమ్మన్న, కాలువపల్లి, బొమ్మగుప్ప మండలం



సంక్షేమానికి మారుపేరు



నవరత్నాల పథకాలతో సంక్షేమానికి మారుపేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. ఏ ఇంటికి వెళ్లినా ఏదో ఒక పథకం లబ్ధి పొందినట్లుగా చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేయడం చాలా గొప్ప విషయం. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. దీంతో అందరి దృష్టి ప్రభుత్వ పాఠశాలలపైనే పడింది. సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలకు అపారమైన నమ్మకం ఏర్పడింది. ఇలాంటి సంక్షేమ పాలన కావాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

– నూర్‌బాషా, విశ్రాంత హెడ్‌మాస్టర్, రామకోటి, పెద్దపప్పూరు మండలం

జీవనోపాధులు మెరుగుపడ్డాయి



గతంలో సంక్షేమ పథకాలు అందక చాలా ఇబ్బందులు పడ్డాం. కూలి పనులే దిక్కయ్యాయి. సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలతో మా జీవనోపాధులు మెరుగుపడ్డాయి. మా కుమారుడు ఆంజనేయులుకు వలంటీర్‌గా పనిచేసే అవకాశం కల్పించారు. ఆసరా పథకంతో ఏటా రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు అందించారు. నా భర్త హనుమంతుకు కళాకారుల పింఛన్ అందుతోంది. చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుకున్నాం. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద కోడలు దివ్యకు రూ.లక్ష అందజేశారు. దీంతో ఒక్కసారిగా మా కుటుంబంలో జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. మరోసారి వైఎస్ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– రామాంజినమ్మ, రామినేపల్లి, బొమ్మగుప్ప మండలం

ఓటు వివరాలూ తెలుసుకోవచ్చు

- అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్
- ఓటు హక్కు లేకపోతే ఫారం–6 ద్వారా దరఖాస్తు
- ఓటుకు ఫోన్ నంబర్ అనుసంధానం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఎన్నికల్లో ప్రతి పౌరుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇలాంటి తరుణంలో ఓటరు జాబితాలో తన పేరు ఉన్నదో? లేదో? అనే ఆత్రుత అందరిలోనూ నెలకొంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్... జాబితాలో ఓటు వివరాలు తెలుసుకునే సదవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటర్ హెల్ప్‌లైన్..

- ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారి (బీఎల్‌ఓ), తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి ఓటు హక్కు ఉందో... లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇందు కోసం ప్రత్యేకంగా ఓటర్ హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.
- స్మార్ట్‌ఫోన్లలో 'ఓటర్ హెల్ప్‌లైన్ యాప్'ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే ఆప్షన్లు వస్తాయి. 'సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై' కింద వచ్చిన ఆప్షన్లలో 'సెర్చ్ బై ఎపిక్ నంబర్' ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.



ఓటరు హెల్ప్‌లైన్ యాప్

- కంప్యూటర్ ద్వారా ఓటర్ వివరాలు తెలుసుకునే వారు https:// electoralsearch.eci.gov.in/ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్ బై ఎపిక్ నంబర్ అనే ఆప్షన్ పై క్లిక్ చేసి, ఓటర్ ఐడీ నంబర్, స్టేట్ అనే చోట ఆంధ్రప్రదేశ్ అని సెలెక్ట్ చేసుకోవాలి. క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్‌ను క్లికి చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.
- ఓటు వివరాలు తెలుసుకునేందుకు 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్ అందుబాటులో ఉంచింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఓటర్ ఐడీ నంబర్ చెబితే... అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

ఓటు లేకపోతే నమోదు చేసుకోవాలి..

ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎల్‌ఓ, తహసీల్దారు కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఫోన్ నంబర్‌తో అనుసంధానం ఇలా...

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. http:// ceoaperms.ap.gov.in/AP&MobileNoRegistration/MobileNoRegistration.aspx లింక్‌ను తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్ ఎంటర్ చేయాలి. దాని కిందనే ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత ఓటర్ ఐడీకి ఫోన్ నంబర్ అనుసంధానమవుతుంది.

గజ వాహనంపై చెన్నకేశవుడు



యాడికి: మండల కేంద్రంలో వెలసిన శివలక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి దేవేరులతో కలసి గజ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అర్చకుడు హరికష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి 10 గంటలకు మూలాసాయి సుబ్రహ్మణ్యం కుమారులు సాయినాథ్, భానుప్రకాష్ ఉభయదారులుగా వ్యవహరిస్తూ గజ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కుర్ని కులస్తుల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: కుర్ని కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలో కుర్ని కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ కుర్ని కులస్తుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అన్నివిధాలా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట ఇస్తే మడమ తిప్పరని, హామీలన్నీ నెరవేరుస్తారని తెలిపారు. సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో రూరల్ సర్పంచ్ ఉదయ్ శంకర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఫయాజ్ బాషా, బీసీ నేతలు సంపంగి గోవర్ధన్, జోగి రాజేంద్ర, కుర్ని సంఘం అధ్యక్షుడు మహాదేవ ప్రసాద్, నాయకులు రఘు, శ్యామ్, చంద్రశేఖర్, కాశన్న, లోక్‌నాథ్, ముకుందప్ప, రామకృష్ణ, విజయ్ కుమార్, మోహన్, రామచంద్ర, శ్రీహరి, సోమశేఖర్, శివప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి, చిత్రంలో రమేష్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్యే సీట్లు అమ్ముకున్న చంద్రబాబు

- శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఎమ్మెల్యే అభ్యర్థుల సీట్లు అమ్ముకుని పార్టీని నమ్ముకున్న వారికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీరని మోసం చేశారని ఆ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి మండిపడ్డారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. నాయకులు కృష్ణమూర్తి, దలవాయి వెంకటనారాయణ, పోలన్న మాట్లాడుతూ.... రాజకీయంగా వడ్డెర్లను ఎదగనివ్వకుండా చంద్రబాబు తొక్కి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలలో పోటీ చేసే అవకాశం ఇస్తానని గతంలో చంద్రబాబు మాట ఇచ్చారని గుర్తు చేశారు. పుట్టపర్తి అసెంబ్లీ స్థానాన్ని రూ. కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఎంపీ స్థానాన్ని కూడా వడ్డెర్లకు కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న వారిని చంద్రబాబు నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వడ్డెర్లకు రాజకీయ అవకాశం కల్పించకపోతే టీడీపీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుంచెపు వెంకటేష్, మారెప్ప, చక్రపాణి, మల్లికార్జున, గంగులప్ప, ఉత్తన్న, నాగరాజు, హోన్నూరు, నారాయణస్వామి, శ్రీరాములు, పెద్దన్న, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూల్యాంకనం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనంలో భాగంగా ఈనెల 26న కెమిస్ట్రీ, హిస్టరీ, 28న బాటనీ, జువాలజీ, కామర్స్ జవాబుపత్రాలను నేటి (సోమవారం) నుంచే ప్రారంభమవుతాయని క్యాంపు ఆఫీసర్, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎం.వెంకటరమణ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా సబ్జెక్టులకు మూల్యాంకన ఉత్తర్వులు పొందిన చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు సోమవారం ఉదయం అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని క్యాంపునకు చేరుకోవాలని కోరారు.

వీఏహెచ్‌ఏల శిక్షణ పర్యవేక్షణకు అధికారుల నియామకం

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ)గా ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల కొత్తగా నియమితులైన 457 మందికి ఏప్రిల్ ఒకటి నుంచి 45 రోజుల పాటు విధి విధానాలపై శిక్షణ ఉంటుంది. ఈ కార్యాచరణను పక్కాగా నిర్వహించేందుకు 28 అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఆదివారం సర్క్యులర్ జారీ చేశారు. మొత్తం శిక్షణా కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతను అనంతపురం, ఉరవకొండ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ జి.వెంకటేష్‌కు అప్పగించారు. అలాగే కోర్సు కో ఆర్డినేటర్ కమ్ రిసోర్సు పర్సన్లుగా పశుశాఖకు చెందిన ఏడీలు ఎస్.శ్రీనివాసగుప్తా (కళ్యాణదుర్గం), కేఎల్ శ్రీలక్ష్మి, డి.శ్రీనివాసరావు (అనంతపురం), వి.రామచంద్రారెడ్డి (రెడ్డిపల్లి), ఏపీ రత్నకుమార్ (బుక్కరాయసముద్రం), ఎం.రాధిక (కంబదూరు) నియమితులయ్యారు. రిసోర్సు పర్సన్లుగా సి.సుబ్రహ్మణ్యం (ఏడీ–రెడ్డిపల్లి), టీవీ సుధాకర్ (ఈఓ–డీఎల్‌డీఏ), బి.నాగార్జునరెడ్డి (ఎఫ్ఎఫ్‌డీఓ–ఏడీ), ఏడీలు జె.సురేష్ (అనంతపురం), జి.పద్మనాభం (శింగనమల), ఎం.కాంతమ్మ (ఉరవకొండ)తో పాటు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు (వీఏఎస్) టి.కిరణ్‌కుమార్‌రెడ్డి (సలకంచెరువు), ఎ.గోల్డ్‌స్మన్ (అనంతపురం), కె.గోవిందరాజులు (నార్పల), పి.మహేష్ (నాగసముద్రం), వి.కృష్ణమూర్తి నాయక్ (కొనకొండ్ల), ఎ.రమేష్ (బొమ్మగుప్ప), పి.మంజునాథ్ (పాలవాయి), బి.సూర్యనారాయణరెడ్డి (పల్లేపల్లి), పి.నవీన్‌కుమార్ (నేత్రపల్లి), సి.చేతన్‌కుమార్ (సిద్ధరాంపురం), కె.వినోద్‌కుమార్ (అనంతపురం), జె.శ్రీకాంత్, వి.స్రవంతి (రెడ్డిపల్లి), పశు శాస్త్రవేత్త డాక్టర్ కె.మాధవిని నియమించారు.

27న టీసీఎస్ క్యాంపస్ డ్రైవ్

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఈ నెల 27న టీసీఎస్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తెలిపారు. వర్సిటీ ట్రాన్సిట్ క్యాంపస్ –2, సీఆర్ఐటీ కళాశాల క్యాంపస్‌లో ఉదయం 9 గంటలకు డ్రైవ్ ప్రారంభమవుతుందన్నారు. 2022,2023 సంవత్సరాల్లో గుర్తింపు పొందిన వర్సిటీల నుంచి ఆర్ట్స్, కామర్స్, సైన్స్ స్ట్రీమ్‌ల్లో బ్యాక్‌లాగ్ లేకుండా రెగ్యులర్ డిగ్రీ పూర్తి చేసినవారు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. విద్యార్థులు రాత పరీక్షకు హాజరయ్యే ముందు http://nextstep.tcs.com/campus/ వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

జీజీహెచ్‌కు మహర్దశ

- వివిధ పనులకు గతేడాది రూ.3.5 కోట్ల మంజూరు
- శరవేగంగా సాగుతున్న పనులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసేలా జగన్ సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకుంది. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ రకాల అభివృద్ధి పనులకు గతేడాది ఆగస్టులో రూ.3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కొన్ని పనులు శరవేగంగా సాగి రోగులకు అందుబాటులోకి తీసుకురాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. పాత భవనంలోని గైనిక్, రేడియాలజీలో రూ.కోటి, సర్జికల్ విభాగంలో రూ.65 లక్షలు, ఆర్థో విభాగానికి రూ.1.05 కోట్లు, అక్యూట్ మెడికల్ కేర్‌కు రూ.57 లక్షలు, మార్చురీ పునరుద్ధరణ పనులకు రూ.23 లక్షలు చొప్పున కేటాయించి పనులు చేపట్టారు.

రూ.1.05 కోట్ల పనులు పూర్తి..

సర్వజనాస్పత్రిలోని ఆర్థో బ్లాక్ అభివృద్ధికి కోసం కేటాయించిన రూ.1.05 కోట్ల నిధులు వెచ్చించి పనులు పూర్తి చేశారు. కాగా గైనిక్, రేడియాలజీ, గైనిక్ విభాగం, సర్జికల్ విభాగం, మార్చురీ పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో రూఫింగ్ పనులు పూర్తి చేశారు. ఈ యూనిట్‌లోని మూడు గదుల్లో పనులు పూర్తికాగా, ఇంకా ఏసీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతమున్న ఆరు ఏసీల్లో ఒకటి మాత్రమే పని చేస్తోంది. మిగిలిన వాటినీ మరమ్మతు చేయించేందుకు ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. కాగా, ఇంజినీరింగ్ అధికారులు మరింత చొరవ తీసుకుంటే పనులు శరవేగంగా పూర్తవుతాయనే అభిప్రాయాలను వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు.


రూఫింగ్ పనులు పూర్తి కావడంతో అందుబాటులోకి వచ్చిన అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్

ఆర్టీసీ బస్సు బోల్తా


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

చిలమత్తూరు: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. వివరాలు... బెంగళూరు నుంచి తాడిపత్రికి బయలుదేరిన పీటీడీ బస్సు చిలమత్తూరు మండలం కోడూరు థామస్ మన్రో తోపు సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ఓ ప్రయాణికుడిని ఎక్కించుకుని ముందుకు కదిలింది. దాదాపు 200 మీటర్ల దూరం వెళ్లగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో మొత్తం 25 మంది ప్రయాణికులు ఉన్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా చిలమత్తూరులోని పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందజేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కార్తికేయుడికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కాలసర్ప నివారణ హోమాలతో పాటు, వివిధ పూజలు చేపట్టారు. ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఓఆర్ఎస్ ఎనర్జీ డ్రింక్ పంపిణీ

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం వారి ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది విద్యార్థులకు ఓఆర్ఎస్ ఎనర్జీ డ్రింక్ పంపిణీ చేశారు. అనంతపురం, బుక్కరాయసముద్రం, శింగనమల ప్రాంతాల్లోని వసతి గృహాల్లోని విద్యార్థులకు రూ.40 వేలు విలువైన ఓఆర్ఎస్ ఎనర్జీ డ్రింక్ అందించినట్టు సంస్థ చైర్మన్ డాక్టర్ నిర్మల మురళీ తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలను వివరించారు. పరీక్షల నేపథ్యంలో ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

కమనీయం.. కల్యాణం



అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మలహోబిల లక్ష్మీనరసింహ స్వామికి అర్చకులు కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం



నరసింహులు భార్యకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: తమతో పాటు చదువుకున్న ఓ మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నరసింహులు కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిత్రులంతా చందాలు వేసుకుని సేకరించిన రూ.50 వేల ఆర్థికసాయాన్ని మృతుడి భార్య మంజులకు అందజేశారు. అనంతరం చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పది వేల రూపాయల విలువైన కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్ఎస్ రాయుడు, ఆదినారాయణరెడ్డి, గాయత్రి, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు



ఆత్మకూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు, సిద్ధరాంపురం, ఆత్మకూరు, ముట్టాల, గొరిదిండ్ల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మునీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు గాని, గొడవలు, కక్షలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. రాజకీయ నాయకులు ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలన్నారు. గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడైనా గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అభివృద్ధి చేశాం.. అండగా నిలవండి

- ఎర్రనేల కొట్టాలలో ముంపు సమస్యకు పరిష్కారం చూపాం
- బ్రిడ్జి, అంతర్గత రోడ్ల ఏర్పాటుకు చర్యలు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 1వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరంలోని వివిధ డివిజన్లలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాలలో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 1వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధానంగా ఎర్రనేల కొట్టాలలో ముంపు సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో వర్షం వస్తే గుత్తి రోడ్డుకు వెళ్లే మార్గం రాజహంస ఎదురుగా ఉన్న లోతట్టు ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.35 లక్షల వ్యయంతో ఎర్రనేల కొట్టాల నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లే మార్గం వరకు విశాలవంతమైన సీసీ రోడ్డు, రూ.50 లక్షల వ్యయంతో అంతర్గత రోడ్లు, లెక్చరర్స్ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

రూ.కోటితో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం

ఎర్రనేల కొట్టాల నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తమ ప్రభుత్వంలో రూ.కోటి వ్యయంతో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జ్వరం, జలుబు, విష జ్వరాలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగులకు సేవలందించేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రం ఉపయోగపడుతోందన్నారు. 60 రకాల పరీక్షలు.. 174 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపుతామన్నారు. నియోజకవర్గంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా తదితర పథకాల ద్వారా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చినట్లు తెలిపారు. గతంలో పింఛన్ పొందాలంటే ప్రభుత్వ పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు చేసే దయనీయమైన పరిస్థితులు ఉండేవన్నారు. పింఛన్ కోసం పుస్తకాలు, ఏదైనా వస్తువులను క్యూలో ఉంచి నీడపాటున ముసలి ముతక ఉండే పరిస్థితులు చేశామని తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజన్ కల్గిన నాయకుడని, మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, ఆర్డీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, కార్పొరేటర్లు లాలెప్ప, డైరెక్టర్లు శోభారాణి, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, స్థానికులు హనుమంతు, జనార్దన్ రెడ్డి, హుస్సేన్, లక్ష్మయ్య, ఆది, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి రామయ్య, వనారస బలారం, జావెద్, జానీ, భారతి, తలారి ఉష, శోభాబాయి, రాధా, హజరాంబి, పార్వతి, సాకే కుళ్లాయ స్వామి, అమర్‌నాథ్ రెడ్డి, జోగి రాజేంద్ర పాల్గొన్నారు.

నెలాఖరులోపు పన్ను చెల్లించాలి



పన్ను చెల్లింపు కౌంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: అసెస్‌మెంట్‌దారులు ఈ నెలాఖరులోపు పన్ను ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లించాలి. వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఆదివారం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పరిశీలించారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సతీష్, సుజాత, మురళీ, వేణు, పద్మావతి, బాబు తదితరులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షించారు. అసెస్‌మెంట్‌దారులు సకాలంలో వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు చెల్లించకపోతే తీసుకునే చర్యలను వివరించాలన్నారు. నెలాఖరులోపు పన్ను వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ఆదివారం రూ.22 లక్షల పన్ను వసూలైనట్లు వెల్లడించారు.

నేడు పన్ను చెల్లింపులకు అవకాశం

సోమవారం సెలవు రోజున పన్ను చెల్లింపులకు నగరపాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసెస్‌మెంట్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని మేయర్ మహమ్మద్ వసీం సలీం కోరారు. ఆదివారం నగరంలోని ఈద్గా మసీదులో జరిగిన జోహర్ నమాజ్ అనంతరం మసీదు వెలుపల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మేయర్ వసీం, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ తదితరులు మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రజల కోసం పరితపించే సీఎం జగన్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముస్లింలకు నేరుగా పదవులివ్వడమే కాకుండా నామినేటెడ్ పోస్టుల్లో రాజకీయంగా ఎదిగేందుకు సాయం చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా, షెక్షావలి, జావిద్, తానీషా, ఆదం, మదార్‌వలీ, జావీద్, వేముల నదీం, గఫార్, బాబావలి, నజీర్, కైలాష్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ మోసపూరిత హామీలు నమ్మొద్దు'

ఆత్మకూరు: గత ఎన్నికల్లో నెరవేరని హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మళ్లీ అధికారం కోసం సూపర్ సిక్స్ అంటూ వస్తున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని వడ్డుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా అధికారంలో ఉండి మంత్రిగా చేసిన సునీతమ్మ ఏనాడు నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించలేదన్నారు. నీరు చెట్టు పేరుతో దోచుకున్నారని తెలిపారు. జన్మభూమి కమిటీ సభ్యులను అడ్డం పెట్టుకుని ప్రజలను నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రాప్తాడు అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చి రైతుల కళ్లలో ఆనందం చూశారన్నారు. ఉచిత బోర్లు వేయిచారని గుర్తు చేశారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఇంటి నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, సర్పంచులు లక్ష్మీనారాయణ రెడ్డి, ఓబులేష్, ఎర్రిస్వామి, నాగరత్నమ్మ, ఓబులేసు, వైస్ ఎంపీపీ విజయ్, ఎంపీటీసీలు పోతులయ్య, ఓబులేష్, నాయకులు ఓబిరెడ్డి, శివారెడ్డి, వాసుదేవ రెడ్డి, ఫణిరెడ్డి, వీరాంజనేయులు, సుధీర్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, మహేష్, ఈశ్వరరెడ్డి, వన్నూరప్ప అతికొరెడ్డి, శంకర్‌నారాయణరెడ్డి, వెంకటేష్, ఆదినారాయణ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఏబీ వెంకటేశులు, బాలమహేష్, నారాయణ స్వామి, పరందాముడు, మురళీ, దామోదర్, శీరామ్, ఓబీ టైలర్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డుపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గ్రామాల్లో జోరుగా ప్రచారం



కొడిమి పంచాయతీలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



ఉప్పరపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి బోయ శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలంలో వివిధ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కొడిమి పంచాయతీ జ్యోతిబసు కాలనీ, ప్రజా చైతన్యకాలనీ, ఆటో కాలనీ, దర్గా కొట్టాలులో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బండి పవన్, మహిళా విభాగం నియోజకవర్గ కన్వీనర్ అంజనాదేవి వివరించారు. సర్పంచ్‌లు సుబ్బిరెడ్డి, అంజియాదవ్, ఎంపీటీసీ వెంకటలక్ష్మీ, నాయకులు తిరుపాల్‌రెడ్డి, భానుకోట శివ, చంద్ర, పాముదాయి సత్తి, రాయల్ సుబ్బు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో..

ఉప్పరపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఎంపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామస్వామి, ఉప సర్పంచ్ బండి భాస్కర్, పూలకుంట, ఆకుతోటపల్లి సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్, నాయకులు పూలకుంట భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆనంద్, పెద్దిరెడ్డి, ఇటుకలపల్లి చిరంజీవి, ఉప్పరపల్లి మండల గోపాల్, ఆనందప్ప, హరికృష్ణ, కొండారెడ్డి, దండోరా కాలనీ రామాంజి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు



రాప్తాడు: రాజకీయ పార్టీలు తమ ప్రచార పర్వానికి అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఊరేగింపులు, సభలకు డీఎస్పీ అనుమతి ఉండాలన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే పార్టీ కార్యాలయానికి స్థానిక డీఎస్పీ, వ్యయ పరిశీలకుల అనుమతి తీసుకోవాలని సూచించారు. వాహనం ఉపయోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల అనుమతి ఉండాలన్నారు. లౌడ్ స్పీకర్‌తో రోడ్ల కూడలిలో మీటింగ్‌లు, స్టేజీ, బారికేండ్ల నిర్మాణానికి స్థానిక డీఎస్పీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లౌడ్ స్పీకరు లేకుండా మీటింగ్ నిర్వహణకు స్థానిక ఎస్‌డీపీఓ, వ్యయ పరిశీలకుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీ నిర్వహణ తదిరత వాటికి పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలో తిరిగే ప్రచార వాహనాలకు కలెక్టర్, పూర్తి అసెంబ్లీ ఏరియాలో తిరిగే వాహనానికి, అసెంబ్లీ ఏరియా పరిధిలో తిప్పే ప్రచార రథాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి ఉండాలని తెలియజేశారు. కరపత్రాల పంపిణీ కోసం వ్యయ పరిశీలకుల అనుమతి, బ్యానర్ల, జెండాల ప్రదర్శనతో పాటు పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, కటౌట్ల ఏర్పాటుకు డీఎస్పీ వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా, ప్రత్యక్షంగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అనుమతులు తీసుకోవాలన్నారు.

విజయలక్ష్మికి డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని స్టాటిస్టిక్స్ విభాగంలో పరిశోధన చేసిన జి.విజయలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కే.పుష్పాంజలి పర్యవేక్షణలో ఆన్ సమ్ యాస్పెక్ట్స్ ఆఫ్ ఫోర్‌క్యాస్టింగ్ మెథడ్స్ విత్ ఎక్స్‌పోనెన్షియల్ స్మూతింగ్ ఇన్ ద ప్రొడక్షన్ ఆఫ్ ప్రైమ్ ఫుడ్ గ్రెయిన్స్ ఇన్ ద స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్–యాస్ ఏ ఎరినా అండ్ యాన్ మోడల్ అప్రోచ్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: శంకరమఠం వేదికగా గత మూడు రోజులుగా సాగుతున్న మహాకుంభాభిషేక వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. విశిష్ట అతిథిగా విచ్చేసిన శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామిజీ చేతుల మీదుగా శంకర భగవత్పాదుల, శారదామాత పంచలోహ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠలు శాస్త్రోక్తంగా జరిపించారు. దేవతామూర్తులకు అభిషేకాలు, కుంకుమార్చనలు, శ్రీసూక్తం, లలితాసహస్ర పారాయణం చేయించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి ఆత్మీయ అతిథులుగా విచ్చేసి స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఆధ్యాత్మిక మార్గం, సేవా విశిష్టత తదితర అంశాలపై స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భక్తుల పాదపూజలు, దర్శనాలతో స్వామీజీ అనంత పర్యటన ముగించుకుని తుమకూరుకు తరలివెళ్లారు.

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 1, 4వ డివిజన్లలో సోమవారం ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు పాత రాజహంస అపార్ట్‌మెంట్ (గుత్తి రోడ్డు) పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఓల్డేజ్ హోం నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సంతల ఆదాయం రూ.3.45 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.45 లక్షల ఆదాయం వచ్చినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేలు సంతలో రూ.1.75 లక్షలు, ఆదివారం జరిగిన ఆవులు, గేదెలు, ఎద్దుల సంత ద్వారా రూ.1.70 లక్షలు మేర ఆదాయం వచ్చినట్లు వివరించారు.

29 నుంచి ఆలిండియా లాక్రోస్ టోర్నీ



ఆలిండియా టోర్నీకి ఎంపికైన లాక్రోస్ క్రీడాకారులు

అనంతపురం: ఆగ్రాలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ ఆలిండియా లాక్రోస్ బాయ్స్ అండ్ గరల్స్ టోర్నీ జరగనుంది. ఇందుకు సంబంధించి అనంతపురం జిల్లా లాక్రోస్ అసోసియేషన్ తరఫున ప్రాతినిథ్యం వహించనున్న క్రీడాకారులకు ఈనెల 20వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆదివారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన లాక్రోస్ అసోసియేషన్ సెక్రెటరీ రాధిక, ట్రెజరర్ బి. లింగప్రసాద్, నోబుల్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడగు కే. మిరాజుద్దీన్, భాస్కర్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీ



ప్రతిభ చాటిన క్రీడాకారులు

అనంతపురం: నగరంలో రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్–2024 పోటీలు ఆదివారం జరిగాయి. మొత్తం ఆరు రౌండ్ల పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసి రూ.లక్ష నగదు బహుమతి అందజేసినట్లు ఏ1 చెస్ అకాడమీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 4 నుంచి 9వ తేదీ వరకూ భీమవరంలో జరిగే ఇంటర్నేషనల్ ఫిడే ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఓపెన్ కేటగిరీలో ప్రథమ స్థానం మన్యు సాయి 6/6, తిరుపతి జిల్లా, ద్వితీయ స్థానం మాధవ నాయుడు, 5/6 పాయింట్లు , అనంతపురం జిల్లా, మూడో స్థానం అస్మిత అనిమి, 5/6 పాయింట్లు అనంతపురం, నాలుగో స్థానం వెంకట శ్రీ చైతన్ రెడ్డి, అనంతపురం దక్కించుకున్నారు.

ఎర్రచందనం చెట్లకు నిప్పు

తాడిపత్రి: మండలంలోని తలారి చెరువు గ్రామంలో 100 ఎర్ర చందనం చెట్లు దహనమయ్యాయి. బాబాబాధిత రైతు కిషోర్‌రెడ్డి వివరాల మేరకు.. 2.75 ఎకరాల్లో దాదాపు రూ. 36 లక్షల వ్యయంతో 750 మొక్కలను మూడు సంవత్సరాల క్రితం నాటాడు. ఆదివారం మధ్యాహ్నం పక్క పొలానికి చెందిన బాల దస్తగిరి పాతకక్షలతో పొలం గట్టుకు ఉద్దేశ పూర్వకంగా నిప్పుపెట్టాడు. మంటలు వ్యాపించి కోషోర్‌రెడ్డి పొలంలోని వంద ఎర్రచందనం చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. రూ. 26 లక్షలు నష్టం వాటిల్లిందని రూరల్ పోలీసులకు ఆదివారం బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

ఏసుక్రీస్తుకు ఆహ్వానం



ప్రార్థనలు చేస్తున్న మహిళలు



తాటి మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మట్టల ఆదివారం (పామ్ సండే) వేడుకలు పలుచోట్ల వైభవంగా జరిగాయి. మట్టలను చేత పట్టుకుని క్రీస్తును ఆహ్వానిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యంగా నగరంలోని సీఎస్ఐ ప్రార్థనా మందిరంలో రాయలసీమ డయాసిస్ బిషప్ డాక్టర్ వెయ్యాల ఐజాక్ వరప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మట్టల ఆదివారం విశేషాలు వివరించారు. గుడ్ ఫ్రైడే దినాలకు ముందు వచ్చే ఆదివారం ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. శుభ శుక్రవారానికి ముందు క్రీస్తు యెరూషలేములోకి ప్రవేశిస్తారన్నారు. క్రీస్తును ఖర్జూరపు మట్టలతో స్వాగతిస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారని పేర్కొన్నారు.

ఆ అపురూప ఘట్టానికి గుర్తుగా మట్టల ఆదివారం వేడుకలు జరుగుతాయన్నారు. అలాగే పాస్టర్ బెన్‌హర్‌బాబు సామూహిక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో సెక్రటరీ జాన్‌సుధీర్, సంఘం పెద్దలు జెడ్ దేవరాజు, జాన్ చంద్రశేఖర్, సునీల్ కుమార్, సురేష్, ఇమ్మాన్యుయల్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.